వైద్య కళాశాల పనులు వేగవంతం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ వైద్య కళాశాల పనులను వేగవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్ రామకృష్ణ డిమాండ్ చేశారు. స్థానిక జెఎన్‌టియు జంక్షన్‌లో చేపడుతున్న ప్రభుత్వ వైద్యకళాశాల భవన నిర్మాణాలను ఆదివారం ఎస్‌ఎఫ్‌ఐ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది నుంచి 150 సీట్లతో ప్రభుత్వ వైద్య కళాశాలలో తరగతులు నిర్వహిస్తామని ప్రకటించిందన్నారు. ఇక్కడ కనీసం ఉండడానికి భవనాలు కూడా లేవన్నారు. తరగతులను నిర్మాణంలో ఉన్న భవనాల్లో నిర్వహిస్తారా? లేకుంటే మరోచోట కొనసాగిస్తారా? స్పష్టంగా చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస మౌలిక సౌకర్యాలు కల్పించకుండా తరగతులు నిర్వహిస్తే ఇబ్బందులు పడేది విద్యార్థులని చెప్పారు. వెంటనే భవన నిర్మాణ పనులను వేగవంతం చేయాలని డిమాండ్ చేవారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె.రవికుమార్, పట్టణ కార్యదర్శి పి.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నిప్పులు కక్కుతున్న సూర్యుడు

- మేలో మాదిరిగా భారీ ఉష్ణోగ్రతలు
- పలుచోట్ల 45 డిగ్రీలు దాటిన ఎండ
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం
- అల్లాడిపోతున్న వృద్ధులు, పిల్లలు

ప్రజాశక్తి - విజయనగరంటౌన్

ఓ వైపు పెరిగిన ఉష్ణోగ్రతలు.. మరోవైపు వడగాల్పులు.. రెండు వారాలుగా జిల్లా ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. భానుడు పగ పట్టినట్టు మేలో మాదిరిగానే నిప్పులు కక్కుతున్నాడు. రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెంచుకుంటూ పోతున్నాడు. సాధారణంగా జూన్ మొదటి వారంలో వాతావరణం కొంత చల్లబడుతుంది. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లాలో ఆదివారం పలు ప్రాంతాల్లో 42 డిగ్రీల సెల్సియస్ గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండకు తోడు వేడిగాలులు, తీవ్ర ఉక్కపోతతో జనం అల్లాడిపోయారు. ఎండ వేడిమికి పిల్లలు, వృద్ధులు, రోగులు విలవిల్లాడారు. పాదచారులు, వాహనదారులు చెమటలు కక్కుతూ తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఎండ తీవ్రతకు రద్దీగా ఉండే రోడ్లు కూడా నిర్మానుష్యంగా మారాయి.

నిర్మానుష్యంగా మారిన ఎంజి రోడ్డు

జిల్లాలో ఉదయం ఎనిమిది గంటల నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. పది గంటల తర్వాత ఇంటి నుంచి బయటకు రావడానికే జనం భయపడుతున్నారు. జిల్లాలోని అన్ని మండలాల్లోనూ 38 డిగ్రీల నుంచి 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నాయి. ఆదివారం శృంగవరపుకోటలో 43, విజయనగరంలో 42 డిగ్రీలు, రాజాం, చీపురుపల్లి, గజపతినగరం, బొబ్బిలిలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. మొత్తమ్మీద భానుడు ఆదివారం మరింత మండిపోయాడు. పది గంటల నుంచే వేడి గాలులు వీచాయి. ఉక్కపోత కూడా తీవ్రంగా ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఆరుబయట పనులు ఉన్న వారు ఆపసోపాలు పడ్డారు. అత్యవసర ప్రయాణాలు చేసే వారు టోపీలు, స్కార్ఫ్‌లు ధరించారు. ఇంట్లో ఫ్యాన్ కింద ఉన్నా వేడిగాలులు వీయడంతో ఉక్కపోతతో అల్లాడారు. వృద్ధులు, చిన్నారులు, రోగులు పడిన అవస్థలు అంతా ఇంతా కాదు. గత రెండు రోజులుగా సాయంత్రం ఆరు గంటల వరకూ ఎండ తీవ్రత, ఉక్కపోతతో జనం ఇబ్బందులు పడ్డారు. మరోవైపు ఎండ వేడిమి నుంచి ఉపశమనం కోసం పళ్లరసాలు, కొబ్బరి బొండాలను ఆశ్రయించడంతో ఆ దుకాణాలు రద్దీగా కనిపించాయి. ఎండ వేడిమి తీవ్రతతో రోడ్లపై జనం రద్దీ బాగా తగ్గింది. ఎండలో కొద్దిసేపు ప్రయాణించడమే కష్టంగా ఉన్న వేళ ఉపాధి, భవన నిర్మాణ పనులు చేస్తున్న కూలీల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎండ వేడిమి, తీవ్ర ఉక్కపోతతో కూలీలు ఉక్కిరిబిక్కిరయ్యారు. మండుటెండలో పనిచేయలేక ఆపసోపాలు పడ్డారు.

ప్రాంతం	ఉష్ణోగ్రత డిగ్రీలలో
విజయనగరం	42
బొబ్బిలి	41
శృంగవరపుకోట	43
గజపతినగరం	41
రాజాం	41
చీపురుపల్లి	41

సిఎంఆర్ సమీపంలో కూడలిలో జనసంచారం ఇలా..

దాసరి సాకేత్‌నాయుడు
12వ ర్యాంకు

వి.సాయిసూర్యప్రకాశ్
72వ ర్యాంకు

నడిపల్లి సిద్ధార్థ
101వ ర్యాంకు

మీసాల ప్రశాంతి శ్రీ
214వ ర్యాంకు

ఈదుబిల్లి కార్తీక్
474వ ర్యాంకు

జెఇఇ అడ్వాన్స్‌డ్‌లో

సత్తా చాటారు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్, బొబ్బిలి, శృంగవరపుకోట

జెఇఇ అడ్వాన్స్‌డ్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. ఓపెన్ కేటగిరీలో వందలోపు ర్యాంకులు సాధించి అదరగొట్టారు. విజయనగరానికి చెందిన దాసరి సాకేత్ నాయుడు ఓపెన్ కేటగిరీలో 12వ ర్యాంకు సాధించాడు. సాకేత్‌నాయుడు శ్రీచైతన్య జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యనభ్యసించాడు. బొబ్బిలి పట్టణానికి చెందిన వంగపండు సాయిసూర్యప్రకాశ్ ఓపెన్ కేటగిరీలో 72వ ర్యాంకు, ఒబిసి కోటాలో 11వ ర్యాంకు సాధించాడు. ఈదుబిల్లి కార్తీక్ 474వ ర్యాంకు, ఒబిసి కోటాలో 68వ ర్యాంకు సాధించాడు. రామభద్రపురానికి చెందిన నడిపల్లి సిద్ధార్థ 101వ ర్యాంకు సాధించాడు. విజయనగరంలోని శ్రీనివాస నగర్‌కు చెందిన మీసాల ప్రశాంతి శ్రీజ ఓపెన్ కేటగిరీలో 214వ ర్యాంకు, రాజాం మండలానికి చెందిన బి.ధనుష్ సాయి 533వ ర్యాంకు, వంగర మండలానికి చెందిన మిర్యాల అవినాష్ కుమార్ 740వ ర్యాంకు, గోపాలపురానికి చెందిన దాసరి పార్థసారథి 763వ ర్యాంకు సాధించారు. పొట్నూరు సాత్విక ఓపెన్ కేటగిరీలో 1261, ఒబిసి కోటాలో 213వ ర్యాంకు సాధించింది. జామి మండలం తానవరానికి చెందిన వి.ప్రమోద్ ఓపెన్ కేటగిరీలో 1425, ఒబిసి కోటాలో 244వ ర్యాంకు సాధించాడు. విశాఖలోని నారాయణ కళాశాలలో ప్రమోద్ ఇంటర్ విద్యనభ్యసించాడు. ఐఐటి ఢిల్లీలో బిటెక్ కంప్యూటర్ సైన్సు చదువుతానని తెలిపాడు. విజయనగరానికి చెందిన మిత్తిరెడ్డి ప్రియవదన్ సాయి ఒబిసి కోటాలో 830వ ర్యాంకు సాధించాడు. సాయి విశాఖలో నారాయణ కళాశాలలో ఇంటర్ చదివాడు. సాయి తండ్రి ఎం.వి.ఆర్ సింహాచలం పోలీసు శాఖలో పని చేస్తున్నారు. తల్లి లీలావతి గృహిణి. మంచి ర్యాంకులు సాధించిన విద్యార్థులను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

బి.ధనుష్‌సాయి
533వ ర్యాంకు

మిర్యాల అవినాష్‌కుమార్
740వ ర్యాంకు

దాసరి పార్థసారథి
763వ ర్యాంకు

పొట్నూరు సాత్విక
1261వ ర్యాంకు

ఖరీఫ్ సాగుకు సన్నద్ధం

- బొబ్బిలి నియోజకవర్గంలో 34,440 ఎకరాల్లో వరిసాగు
- 5,988 క్వింటాళ్ల విత్తనాలు, 6,960 మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు

ప్రజాశక్తి- బొబ్బిలి

ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే వేసవి దుక్కులు పూర్తిచేసి, విత్తనాలు చల్లేందుకు పొలాలను సిద్ధం చేశారు. వర్షాధార భూములే అధికం కావడంతో విత్తనాలు చల్లేందుకు అదును కోసం చూస్తున్నారు. మరోవైపు వరి విత్తనాలు, ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేస్తున్నారు. గతేడాది మాదిరిగా రైతుభరోసా కేంద్రాల ద్వారానే సరఫరా చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

బొబ్బిలి నియోజకవర్గంలో ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల్లో 34,440 ఎకరాల్లో వరిసాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బొబ్బిలి మండలంలో 16,337 ఎకరాలు, బాడంగి మండలంలో 5350 ఎకరాలు, తెర్లాం మండలంలో 9102 ఎకరాలు, రామభద్రపురం మండలంలో 3650 ఎకరాల్లో వరి సాగు చేయనున్నారు. నియోజకవర్గంలో వరి తరువాత అత్యధికంగా చెరకు 12,433 ఎకరాల్లో సాగవుతోంది. మొక్కజొన్న 8995 ఎకరాలు, పత్తి 5950, గోగు 1710, వేరుశనగ 755 ఎకరాల్లో సాగవుతున్నాయి.

రైతులకు వరి విత్తనాలు, ఎరువులు సంపూర్ణంగా సరఫరా చేసేందుకు వ్యవసాయ శాఖాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. రైతులకు వరివిత్తనాలు 5,988 క్వింటాళ్లు సరఫరా చేసేందుకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు గోదాంలో నిల్వ చేసినట్లు వ్యవసాయ శాఖ ఎడి మజ్జి శ్యామసుందరరావు చెప్పారు. భూమి సారవంతం పెంచేందుకు రైతులకు ఇప్పటికే పచ్చిరొట్ట విత్తనాలు సబ్సిడీపై 80 శాతం మంది రైతులకు సరఫరా చేశారు.

5,988 క్వింటాళ్ల విత్తనాలు సిద్ధం

ఖరీఫ్ సాగుకు రైతులకు వరివిత్తనాలు సరఫరా చేసేందుకు 5,988 క్వింటాళ్లు సిద్ధం చేశారు. బొబ్బిలి పట్టణం, మండలానికి 2,235 క్వింటాళ్లు, బాడంగి మండలానికి 1279, రామభద్రపురం మండలానికి 615, తెర్లాం మండలానికి 1859 క్వింటాళ్లు సిద్ధం చేశారు. కిలో విత్తనాలకు రూ.10 సబ్సిడీ ఇవ్వనున్నట్లు వ్యవసాయ శాఖ ఎడి శ్యామసుందరరావు చెప్పారు. గ్రామీణ వరి విత్తన ఉత్పత్తి పథకం కింద 50 శాతం రాయితీపై విత్తనాలు అందజేయనున్నారు. బొబ్బిలిలో 8, తెర్లాంలో 8, బాడంగిలో 4, రామభద్రపురంలో 4 యూనిట్లు మంజూరయ్యాయి. విత్తనాలు కావాల్సిన రైతులు రైతు భరోసా కేంద్రాలలో పేర్లు నమోదు చేసుకోవాలి.



వేసవి దుక్కు దున్నుతున్న రైతు

6,960 మెట్రిక్ టన్నుల ఎరువులకు ప్రతిపాదనలు

నియోజకవర్గంలో రైతులకు ఎరువులు సరఫరా చేసేందుకు 6,960 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికే 50 శాతం వరకు ఎరువులు రైతు భరోసా కేంద్రాలకు, ప్రయివేట్ ఎరువుల డీలర్లకు, సొసైటీలకు చేరుకున్నాయి. రైతు భరోసా కేంద్రాల ద్వారా 3,480 మెట్రిక్ టన్నులు ఎరువులు, సొసైటీలు, ప్రయివేట్ డీలర్ల ద్వారా 3,480 మెట్రిక్ టన్నుల ఎరువులు సరఫరా చేస్తామని ఎడి శ్యామసుందరరావు చెప్పారు. యూరియా 2,540, డిఎపి 1420, ఎంఒపి 190, కాంప్లెక్స్ ఎరువు 736 మెట్రిక్ టన్నులకు ప్రతిపాదనలు చేశారు.

రైతులకు మెరుగైన సేవలు

ఖరీఫ్ సాగుచేస్తున్న రైతులకు మెరుగైన సేవలు అందిస్తాం. రైతులకు సంపూర్ణంగా ఎరువుల, విత్తనాలు సరఫరా చేస్తాం. రైతులు ఇబ్బందులు పడకుండా రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, విత్తనాలు అందిస్తాం.

- మజ్జి శ్యామసుందరరావు, వ్యవసాయ శాఖ ఎడి

రహదారి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 33వ డివిజన్ మయూరి జంక్షన్ ప్రాంతంలో రూ.32 లక్షలతో నిర్మించనున్న రహదారికి ఆదివారం డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ జి.వి.రంగారావు, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బొద్దాన అప్పారావు మాట్లాడుతూ మయూరి జంక్షన్ నుండి శ్రీనివాస కళాశాల వరకు రహదారి నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఎత్తి బ్రిడ్జి జంక్షన్ నుంచి తమ గార్డెన్ వరకు ఉన్న ప్రాంతానికి ప్రహరీ గోడ నిర్మించి ఆధునీకరించనున్నట్లు చెప్పారు. 33వ డివిజన్‌లో ఇప్పటివరకు రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, జోనల్ ఇన్‌ఛార్జి మారం బాల బ్రహ్మారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గాజులరేగలో గడపగడపకు..

నగరంలోని 48వ డివిజన్ గాజులరేగ ప్రాంతంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి వైసిపి ప్రభుత్వ పనితీరుపై ప్రజాస్పందన ఏవిధంగా ఉందో అడిగి తెలుసుకున్నారు. స్థానిక సమస్యలపైనా ఆరా తీశారు. కొన్నిచోట్ల కాలువలు సరిగా లేవని, విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయాలని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే స్పందించిన ఆయన అధికారులను పిలిచి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో మేయర్ విజయలక్ష్మి, కార్పొరేటర్లు నడిపిల్లి ఆదినారాయణ, పట్టా ఆదిలక్ష్మి, వైసిపి జోనల్ ఇన్‌ఛార్జి బోడసింగి ఈశ్వరరావు, పిఎసిఎస్ అధ్యక్షుడు మధు, వైసిపి నాయకులు కనుగుల రాజా తదితరులు పాల్గొన్నారు.

స్థానిక మహిళలతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

కోలగట్లకు వినతి అందిస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఉపాధ్యాయుల సమస్యలపై

కోలగట్లకు ఫ్యాప్టో వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయుల సమస్యలపై డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామికి ఆదివారం ఫ్యాప్టో నాయకులు వినతి అందించారు. ఫ్యాప్టో దశలవారీ ఉద్యమంలో భాగంగా జిల్లా చైర్మన్ బండి మహేశ్వరరావు ఆధ్వర్యంలో సభ్యులు డి.ఈశ్వరరావు, బుకారిబాబు, రాము, భాస్కరరావు, పైడిరాజు, తవుడు, తదితరులు కోలగట్లను కలిసి 8 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. ఈ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీనిచ్చారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్తామని ఫ్యాప్టో నాయకులు తెలిపారు.

23 నుంచి గురజాడ పాఠశాల రజతోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

గురజాడ పాఠశాల ఏర్పడి 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ నెల 23, 24, 25వ తేదీల్లో రజతోత్సవాలను నిర్వహిస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ ఎం.స్వరూప తెలిపారు. ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో రజతోత్సవాల లోగోను డిఆర్‌ఒ గణపతిరావు ఆవిష్కరించారు. రజతోత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలను స్వరూప వెల్లడించారు. 23న గురజాడ పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 24న జరిగే సభకు జెవివి వ్యవస్థాపకులు వి.బ్రహ్మారెడ్డి ముఖ్యవక్తగా, కేంద్ర మాజీ మంత్రి పి.అశోక్‌గజపతిరాజు ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు చెప్పారు. సాయంత్రం 4.30 గంటలకు డిఎఫ్ఒ ఎస్.వెంకటేష్, గురజాడ స్కూల్ వ్యవస్థాపక సభ్యులు డాక్టర్ ఎంవిఎస్ వెంకటరావుతో సీనియర్ గురజాడ విద్యార్థుల ముచ్చట్లు ఉంటాయని వివరించారు. 25న సాయంత్రం ఐదు గంటలకు విద్యార్థులు, తల్లిదండ్రులు, సీనియర్ విద్యార్థులతో రజతోత్సవ సభ ముగింపు ఉంటుందని తెలిపారు. రజతోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పాఠశాల వ్యవస్థాపక సభ్యులు ఎంవిఆర్ కృష్ణాజి, ప్రధానోపాధ్యాయులు పి.శేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన ఫలితాలే లక్ష్యం

- పక్కా ప్రణాళికతో విద్యా సంవత్సరం ఆరంభం
- జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మేన్ పోస్టులు భర్తీ
- 'ప్రజాశక్తి'తో ఆర్‌ఐఒ ఆదినారాయణ ముఖాముఖి



2023-24 నూతన విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలే లక్ష్యంగా కృషి చేస్తామని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి (ఆర్‌ఐఒ) ఎం.ఆదినారాయణ తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో రాష్ట్రంలో ఇంటర్ ఫలితాల్లో జిల్లాను మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలపడమే లక్ష్యమని చెప్పారు. అందుకు అనుగుణంగా విద్యా ప్రణాళికలు అమలు చేయనున్నామని వివరించారు. ఈ వారం తనను కలిసిన 'ప్రజాశక్తి'కి ఆయన ముఖాముఖి ఇంటర్వ్యూ ఇచ్చారు. జిల్లాలో ఇంటర్ విద్యలో మెరుగైన ఫలితాల కోసం తీసుకుంటున్న చర్యలు, విద్యార్థులకు అందిస్తున్న విద్యా విధానం, సేవల గురించి వెల్లడించారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు...

- ప్రజాశక్తి, విజయనగరం టౌన్

ఉమ్మడి జిల్లాలో ఎన్ని జూనియర్ కళాశాలలు ఉన్నాయి? ఎంతమంది విద్యార్థులు ఉన్నారు?.

ఉమ్మడి విజయనగరం జిల్లాలో మొత్తం 219 జూనియర్ కళాశాలలు ఉన్నాయి. వాటిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు 27 ఉన్నాయి. వీటిలో మొత్తం ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 11,318 మంది ఉన్నారు. ఈ ఏడాది మొదటి ఏడాది విద్యార్థులు బాగానే చేరుతున్నారు.

ఎంతమంది విద్యార్థులను చేర్పించేందుకు లక్ష్యంగా పెట్టుకున్నారు?.

గతేడాది కంటే అదనంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 2 వేల మంది విద్యార్థులను చేర్పించడం లక్ష్యం. విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేర్పించేందుకు కృషి చేస్తున్నాం. ఇప్పటికే కళాశాల అధ్యాపకులను బృందాలుగా ఏర్పాటు చేసి విద్యార్థులు ఇళ్లకు పంపించే ఏర్పాట్లు చేశాం. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరడం వల్ల వచ్చే ప్రయోజనాలను విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. కళాశాలలో అధ్యాపకుల వివరాలు, ల్యాబ్, మౌలిక సదుపాయాలు, విద్యా ప్రమాణాలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తున్నారు.



ప్రయివేటు జూనియర్ కళాశాలల యాజమాన్యాలు ఎంసెట్, ఐఐటి వంటివి చెప్పి విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అటువంటి ప్రయత్నం ఏమైనా చేపట్టారా?.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఎంసెట్ కోసం ప్రత్యేక తరగతులు, శిక్షణ ఇచ్చేందుకు అనుగుణంగా ప్రభుత్వాన్ని అనుమతులు కోరాం. ప్రభుత్వం నుంచి అనుమతి వస్తే ఎంసెట్ కోసం ప్రత్యేక తరగతులు ప్రారంభం కానున్నాయి.

అధ్యాపక పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ అయ్యాయా?.

ఈ విద్యా సంవత్సరానికి కావాల్సిన పాఠ్య పుస్తకాలు ఇంకా జిల్లాకు రాలేదు. ఇంకా రావాల్సి ఉంది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అధ్యాపకులు అన్ని సబ్జెక్టులకు సరిపడా ఉన్నారు. కాంట్రాక్టు, డైలీవేజ్ వంటి పద్ధతుల్లో కొందరు పని చేస్తున్నారు.

ఇంటర్ ఫలితాల మెరుగుదల కోసం తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

గత విద్యా సంవత్సరంలో ఫలితాలు తగ్గడం వాస్తవం. దానిని అధిగమించి, రాష్ట్రంలో ఈ కొత్త విద్యా సంవత్సరంలో మొదటి, ద్వితీయ స్థానంలో జిల్లాను నిలపడమే లక్ష్యంగా విద్యా ప్రణాళిక సిద్ధం చేశాం. అందుకు అనుగుణంగా అధ్యాపకులకు ఆదేశాలు, విద్యా సంవత్సరం కేలండర్ అందజేశాం. విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే ఉదయం, సాయంత్రం అదనపు తరగతులు, స్టడీ అవర్స్ నిర్వహిస్తారు. దాన్ని విద్యా సంవత్సరం ప్రారంభం నుంచే అమలు చేస్తాం.

నాడు-నేడు పనులు ఎంతవరకు వచ్చాయి?.

జిల్లాలో అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నాడు-నేడు పనులు జరుగుతున్నాయి. జూన్ నెలాఖరికి అన్ని పనులు పూర్తి కానున్నాయి. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. తాగునీరు, మరుగుదొడ్లు వంటి సమస్యలు పూర్తి స్థాయిలో పరిష్కారం కానున్నాయి.

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మేన్లు లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. వాటి నివారణకు తీసుకుంటున్న చర్యలు ఏమిటి?.

నైట్ వాచ్‌మెన్ పోస్టులు భర్తీ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో నైట్ వాచ్‌మేన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో వారం పది రోజుల్లో భర్తీ చేస్తాం.

ప్రయివేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణకు తీసుకున్న చర్యలు ఏమిటి?.

జిల్లాలో ప్రయివేటు విద్యాసంస్థలు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా గ్రామీణ ప్రాంతాల్లో రూ.12 వేలు, రూ.15 వేలు, రూ.20 వేలు సబ్జెక్టులను బట్టి వసూలు చేయాల్సి ఉంది. అంతకంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు తప్పవు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేయొచ్చు.

'చీకటి రాజకీయాలు చేసే అవసరం లేదు'

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కొండ గంగుపూడి గ్రామానికి చెందిన టిడిపి నాయకులు దొగ్గ రమేష్, గిరిజన యువకుల పిలుపు మేరకే ఆ గ్రామంలో యువత ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశానికి హాజరయ్యానని చీకటి రాజకీయాలు చేసే అవసరం తనకు లేదని టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ చల్లా వెంకటరావు (టిడిపి) తాను చీకటి రాజకీయాలు నడుపుతున్నానని ప్రచారం చేయడంలో వాస్తవం లేదని ఖండించారు. చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు గ్రామాలలో పార్టీని బలోపేతం చేసేందుకు విస్తృతంగా పర్యటిస్తున్నానని చెప్పారు. ఇందులో చీకటి రాజకీయం ఏముందని ప్రశ్నించారు.

గొంప కృష్ణ

నేడు బంగారువలసలో గడపగడపకు

ప్రజాశక్తి - వంగర

మండలంలోని బంగారు వలసలో నేటి సాయంత్రం నాలుగు గంటలకు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి ఉత్తరావల్లి సురేష్ ముఖర్జీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, జెడ్పిటిసి కరణం రాధమ్మ హాజరు కానున్నట్లు ఈ కార్యక్రమానికి మండలంలో గల వివిధ శాఖల అధికారులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

కంటి తనిఖీలు చేస్తున్న వైద్యులు

కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - జామి

మండలంలోని వెంకటరాజపాలెం గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వేంకటేశ్వర పుష్పగిరి కంటి ఆస్పత్రి సౌజన్యంతో గ్రామంలో 60 మందికి కంటి చికిత్సలు నిర్వహించారు. ఇందులో 13 మందికి శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. గ్రామ సర్పంచ్ చుక్క లక్ష్మీ ఆధ్వర్యంలో వైద్య శిబిరానికి సహాయసహకారాలు అందించారు. కార్యక్రమంలో పాలేశ్వరం అధ్యక్షులు చుక్క వెంకటరావు, రెడ్ క్రాస్ సభ్యులు బాలమురళీ కృష్ణ, క్యాంపు కోఆర్డినేటర్ అజయ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకానికి పుస్తకాలు సిద్ధం

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలిలో ఉన్న సురేష్ స్కూల్ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలను విక్రయించేందుకు రంగం సిద్ధం చేస్తుంది. పాఠశాలలో పుస్తకాలు విక్రయించకూడదని ప్రభుత్వం నిబంధనలు పెట్టినప్పటికి సురేష్ స్కూల్ యాజమాన్యం నిబంధనలను తుంగలో తొక్కుతుంది. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయించేందుకు విశాఖ నుంచి లారీలో పుస్తకాలు తెప్పించి స్కూల్ సమీపంలో ఒక భవనంలో భద్రపరిచారు. స్కూల్లో పుస్తకాలు అమ్మకానికి వ్యతిరేకంగా విద్యార్థి సంఘాలు ఆందోళన చేయడంతో సురేష్ స్కూల్ యాజమాన్యం స్కూల్ సమీపంలో ఒక భవనాన్ని అద్దెకు తీసుకుని అమ్మకానికి సిద్ధం చేస్తుంది. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు విక్రయానికి సిద్ధమవుతున్న స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మణి డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు అమ్మితే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పుస్తకాలను దించుతున్న కూలీలు

మొక్కలు నాటిన టిడిపి నేతలు

ప్రజాశక్తి- బొబ్బిలి

టిడిపి నియోజకవర్గ ఇంచార్జి బేబినాయన జన్మదిన వారోత్సవాలలో భాగంగా రెండో రోజు ఆదివారం మున్సిపాలిటీలో అన్ని వార్డులలో టిడిపి కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు మొక్కలు నాటారు. బేబినాయన జన్మదినం సందర్భంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. వారోత్సవాలలో భాగంగా టిడిపి పట్టణ అధ్యక్షులు ఆర్.శరత్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గెంబలి శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు రౌతు రామమూర్తి, పువ్వల శ్రీనివాసరావు, కౌన్సిలర్లు కె.లక్ష్మీ, హైమవతి, బి.సురేష్, మాజీ కౌన్సిలర్లు సుంకరి సాయిరమేష్, ఎన్నాబాబు, కార్యకర్తలు వార్డులలో మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటామని నాయకులు చెప్పారు.

రోటరీ అధ్యక్ష,కార్యదర్శులకు అభినందనలు

బొబ్బిలి: అంతర్జాతీయ రోటరీ సంస్థలో భాగంగా బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులుగా భాద్యతలు నిర్వహిస్తున్న రొటేరియన్ జెసి రాజు, రొటేరియన్ శ్రీహరిలను ఆదివారం రోటరీ జిల్లా 3020 గవర్నర్ ఆర్ సుబ్బారావు కాకినాడలో నిర్వహించిన రోటరీ ఫౌండేషన్ సెమినార్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ బొబ్బిలి రోటరీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు క్లబ్‌ను నడిపించటంలో, సేవా కార్యక్రమాలను నిర్వహించడంలో, శిక్షణా కార్యక్రమాలకు హాజరై ఉత్తమ పనితీరు కనపరచారని తెలియ చేస్తూ ఫౌండేషన్ సెమినార్ ఛైర్మన్ కల్యాణి చక్రవర్తి, డిస్ట్రిక్ట్ కార్యదర్శి భాస్కరరావులతో కలిసి వెండి నాణేలను బహుకరించి అభినందించారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ తూముల కార్తిక్, మెంబర్షిప్ ఛైర్ చంద్ర కిషోర్, ప్రాజెక్ట్ సర్వీస్ ఛైర్ శ్రీనివాసరావు, పోలియో ఛైర్ సజ్జ అప్పల రాజు, ఉపాధ్యక్షులు నాగరాజు క్లబ్ కార్యనిర్వాహక కార్యదర్శి కె రామకృష్ణ, డేవిడ్ జె విక్టర్‌లు హర్షం వ్యక్తం చేశారు

అవార్డులు అందుకుంటున్న రాజు,శ్రీహరి

4న గంటి ప్రసాదం వర్ధంతి సభ

బొబ్బిలి: విప్లవ వీరుడు గంటి ప్రసాదం వర్ధంతి సభ గంటి ప్రసాదం స్మారక భవనంలో జూలై 4న నిర్వహించనున్నామని పికెఎస్ నాయకులు తవిటినాయుడు, రమణ తెలిపారు. వర్ధంతి ప్రచార పత్రాలను ఆదివారం విడుదల చేశారు. వర్ధంతి సభకు ముఖ్య వక్తలుగా అమరుల బంధు మిత్రుల సంఘం రాష్ట్ర నాయకులు పద్మకుమారి, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు పి.ప్రసాద్, ఇతర నాయకులు హాజరవుతారని, జయప్రదం చేయాలని కోరారు.

వాలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

బొబ్బిలి : మున్సిపాలిటీలో ఖాళీగా ఉన్న 12 వార్డు వాలంటీర్ పోస్టులు భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీ అయినట్లు మున్సిపల్ కమిషనర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 20 నుంచి 24లోగా http://gramavolunteer.ap.gov.in వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈనెల 27 నుంచి 29 వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు

విజయనగరం టౌన్ : విజయనగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను సోమవారం నుంచి ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.సుభ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నగరంలోని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ఆవరణలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసిందని చెప్పారు. బిఎలో హెచ్ఇపి, బికాం, బిఎస్సి- ఎంపిసి, ఎఫ్‌బిజెడ్ వంటి కోర్సులు ఉన్నాయని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

అంధుల పాఠశాలకు చేయూత

విజయనగరం : మేమున్నాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో కొల్లూరు పద్మావతి సహాయంతో ద్వారకామాయి అంధుల పాఠశాలకు ఆదివారం జనరేటర్ వితరణ చేశారు. పిల్లలకు భోజన ఏర్పాట్ల నిమిత్తం రూ.25 వేలు నగదు అందించారు. ఈ సందర్భంగా దాత పద్మావతి మాట్లాడుతూ నిస్వార్థంగా సేవలందిస్తున్న ఇలాంటి సంస్థలకు చేయూతనందించడం ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలియజేశారు.

సమస్యల వలయంలో ప్రభుత్వ పాఠశాలలు

● మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు ● బిల్లు చెల్లింపులు లేక అర్ధాంతరంగా నిలిచిన భవన నిర్మాణాలు ● పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - వంగర

ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించి ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్య నందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న నాడు నేడు పాఠశాలల అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. పాఠశాలలు ప్రారంభించినప్పటికీ మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. కొన్ని పాఠశాలలకు అరకొర నిధులు మంజూరు కావడం, కొన్నింటికి నిధులు మంజూరైనప్పటికీ బిల్లులు చెల్లింపులు లేక భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులకు ఈ ఏడాది కూడా పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు అందకపోవడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు.

మండలంలోని 9 ఉన్నత పాఠశాలలు, 6 ప్రాథమికోన్నత పాఠశాలలు, 34 ప్రాథమిక పాఠశాలలు, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ఎం. సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొన్నేళ్ల క్రితం నిర్మాణం చేపట్టిన మరుగుదొడ్లకు రన్నింగ్ వాటర్ సదుపాయం లేక ప్రస్తుతం అవి చెదలు పట్టి, పిచ్చి మొక్కలతో నిండి నిరుపయోగంగా ఉన్నాయి. ఈ పాఠశాలలో మొత్తం 250 మంది విద్యార్థులు చదువుతున్నారు. మరుగుదొడ్ల సదుపాయం లేక ఆరు బయటకు వెళ్లి ఇబ్బందులు పడుతున్న పరిస్థితి. ఈ పాఠశాలకు గతంలో నిధులు మంజూరైనప్పటికీ ఆ నిధులు దుర్వినియోగం అయ్యాయనే ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ పాఠశాలలో అదనపు గదులు నిర్మించేందుకు మరో భవన నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ బిల్లులు చెల్లింపులు లేక అర్ధాంతరంగా నిలిచిపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

మెట్ట మగ్గూరు గ్రామంలో గల ఎయిడెడ్ పాఠశాలను ప్రస్తుతం మేనేజ్మెంట్ పాఠశాలగా పిలుస్తున్నారు. ఈ పాఠశాలలో ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు 37 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఈ పాఠశాల అతి చిన్నదైనప్పటికీ సమస్యలెన్నిస్తున్నా కావు. ప్రధానంగా తాగునీటికి విద్యార్థులు వంట నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాల వద్ద తాగునీటి బోరు ఉన్నప్పటికీ మరమ్మతులకు గురి కావడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలకు ఎటువంటి నిధులు మంజూరు కాకపోవడంతో అక్కడ పనిచేసిన ప్రధానోపాధ్యాయులు సొంత నిధులతో ఫర్నిచర్ తదితర వాటిని కొనుగోలు చేసుకుంటున్నట్లు తెలిపారు. ఆ పాఠశాలకు సంబంధించి విద్యుత్ బిల్లు కూడా పదివేల రూపాయలు కట్టవలసి ఉందని అయితే దీనికి ఎక్కడ డబ్బులు తెచ్చి కట్టాలి అని ఆయన వాపోయారు.


మగ్గూరు పాఠశాల వద్ద మరమ్మతులకు గురైన తాగునీటి బోరు

సంగాం గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో తరగతి గదులు సదుపాయం పూర్తిస్థాయిలో లేకపోవడంతో విద్యార్థులు క్రిందనే కూర్చుని చదవాల్సిన పరిస్థితి ఉంది. ఈ పాఠశాల విస్తీర్ణంలో చిన్నదైనప్పటికీ పిట్ట కొంచెం కూత ఘనం అన్న విధంగా విద్యాభివృద్ధిలో ఆ పాఠశాల హెచ్ఎం రైతు శ్రీనివాసరావు, ఉపాధ్యాయ సిబ్బంది అంతా సమిష్టిగా పనిచేయడంతో ఆ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్, నవోదయ, మండల, జిల్లా స్థాయిలో వివిధ పోటీల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారు. మండల స్థాయిలో ఆ పాఠశాల ప్రజలలో ఒక గుర్తింపుగా పేరుపొందింది. అయితే ఒకటో తరగతి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు సంబంధించి ఎనిమిది తరగతి గదులు అవసరం ఉన్నప్పటికీ ప్రస్తుతం అక్కడ ఐదు గదులు మాత్రమే ఉన్నాయి. అవి సరిపడక విద్యార్థులు ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. మరో మూడు గదులు ఉంటే ఆ పాఠశాలలో విద్యాభివృద్ధి మరింత మెరుగవుతుందని గ్రామస్తులు అక్కడ ఉపాధ్యాయులు చెప్తున్నారు. ఆ పాఠశాల ప్రాంగణం లోతుగా ఉండటంతో వర్షం పడితే చాలు పాఠశాల ప్రాంగణమంతా నీరు చేరుతుంది. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న పరిస్థితి, అక్కడ వంటగది లేకపోవడంతో మధ్యాహ్న భోజన కార్మికులు నానా అవస్థలు పడుతున్నారు. ఎండకు వర్షానికి గొడుగులు పట్టుకొని వంటలు చేసి ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో నాడు నేడు పనులు మంజూరైనప్పటికీ ప్రహరీ గోడ రంగులు వేశారే తప్ప మౌలిక సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

శివ్వాం ప్రాథమికోన్నత పాఠశాలలో కూడా గదులు చాలకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మరో భవనం నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. భవన నిర్మాణం నత్తనడకన సాగుతోంది. అది పూర్తయితే తరగతి గదుల కష్టాలు తప్పుతాయని విద్యార్థులు చెబుతున్నారు.

ఇలా ఒక్కో పాఠశాల సమస్య చెప్పుకుంటూ పోతే సమస్యలు అన్ని ఇన్ని కావు. ఈ ఏడాది వేసవి సెలవులు అనంతరం పాఠశాలల పు:న ప్రారంభమై వారం రోజులు గడిచింది. పాఠశాలలు ప్రారంభం నుంచీ విద్యార్థులకు మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు జోక్యం చేసుకొని ప్రభుత్వ పాఠశాలల్లో సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

సమస్యలు పరిష్కరిస్తాం

మండలంలోని ఎం సీతారాంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరుగుదొడ్ల సంబంధించి నిధులు ఉన్నాయి. కొత్తగా మరుగుదొడ్ల పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. మగ్గూరులో తాగునీటి బోరు బాగు చేయిస్తాం. సంగాం ప్రాథమికోన్నత పాఠశాలకు నిధులు మంజూరుకు ప్రతిపాదన పంపించాం. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభించి సమస్య పరిష్కరిస్తాం.

వై. దుర్గారావు, ఎంఇఒ, వంగర

ఎం సీతారాంపురం ఉన్నత పాఠశాలలో నిరుపయోగంగా ఉన్న మరుగుదొడ్లు

బిసిలపై వైసిపి పైశాచిక దాడులు అరికట్టాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

బిసి వర్గాలపై వైసిపి గూండాలు చేస్తున్న పైశాచిక దాడులు అరికట్టాలని టిడిపి పార్లమెంటు మహిళా అధ్యక్షులు సువ్వాడ వనజాక్షి డిమాండ్ చేశారు. రాజోలులో జరిగిన బాలుడు హత్యోదంతం పై ఆదివారం సాయంత్రం టిడిపి ఆధ్వరంలో స్థానిక రామతీర్థం జంక్షన్‌లో నిరశన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజోలులో తన అక్కను వేదించ వద్దని వేడుకున్న ఉప్పాల అమర్ నాథ్ అనే బాలుడ్ని దుండగులు పెట్రోల్ పోసి తగల బెట్టడం అమానుషమన్నారు. వైసిపి అధికారం చేపట్టిన తరువాత బిసిల పై దాడుల పెరిగిపోవడం బాలుడు హత్యోదంతం నిదర్శన మన్నారు. వైసిపి పాలనలో శాంతి భద్రతలు లోపించి ప్రభుత్వం నేరగాళ్లను ప్రోత్సహించడం వల్ల అమాయకుల పై దాడుల జరుగుతున్నాయని ఆరోపించారు. కాగా బాలుడు కిరాతకంగా హత్య చేసిన దుండగులను వెంటనే చర్యలు తీసుకోని కఠినంగా శిక్షించాలని బిసిల పై దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గం మహిళా అధ్యక్షులు చిల్ల పద్మ, నగర పంచాయతి అధ్యక్షులు బైరెడ్డి లీలా వతి, పూసపాటిరేగ మహిళా అధ్యక్షులు బొంతు ఉమా, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి విద్యా సాగర నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి గురాన చక్ర ధర్, మండల తెలుగు యువత అధ్యక్షుల నల్లం శ్రీను, నాయకులు అట్టాడ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లిమర్ల: నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

గంట్యాడ: రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను ఆపాలని హోమ్ మినిస్టర్ రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే కెఎ నాయుడు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను నిరసిస్తూ స్థానిక కొటారబెల్లి కూడలిలో ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజోలు వద్ద ఉప్పాడ అమర్నాథ్‌ను అత్యంత దారుణంగా చంపేశారని అభం శుభం తెలియని పిల్లవాడు చిరుప్రాయంలోనే తండ్రిని కోల్పోయిన మొక్కవోని ధైర్యంతో కుటుంబానికి కొండంత అండగా నిలుస్తూ నాన్న లేని లోటును తీరుస్తున్నాడని అటువంటి పిల్లాడిని చంపేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు కొండపల్లి భాస్కర్ నాయుడు, క్లస్టర్ ఇంచార్జ్ రంది చిన్న రామనాయుడు, అల్లు విజయకుమార్, బూడి గాంధీ, రంగలి కృష్ణ, పి సత్యనారాయణ, పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

జాతీయ స్థాయిలో ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించిన కార్మిక కుటుంబానికి చెందిన బెల్లాన నానిని ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని జ్యూట్ కార్మిక నాయకులు కిల్లంపల్లి రామారావు కోరారు. ఖేలో ఇండియా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించిన క్రీడా కారిణి బెల్లాన నానిని ఆదివారం గరికిపేటలో ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక కుటుంబానికి చెందిన నాని జాతీయ స్థాయి లో ప్రతిభ కనబర్చి బంగారు పతకం సాధించడం గొప్ప విషయమన్నారు. పేదరికంలో ఇబ్బందులు పడుతున్నా కృషి, పట్టుదలతో అనుకున్న లక్ష్యాన్ని సాధించి జాతీయ స్థాయిలో బంగారు పతకం సాధించడం కార్మిక వర్గానికి గర్వ కారణ మన్నారు. క్రీడా కారిణి నానిని రామారావుతో బాటు కనకల పద్మ నాభం అభినందించారు.

టిడిపి ఆధ్వర్యంలో సత్కారం

ఖేలో ఇండియా యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో స్వర్ణ పతకం సాధించి గరికపేట గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చిన బెల్లాన నానిని టిడిపి ఆధ్వర్యంలో శనివారం రాత్రి సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్ రవితో పాటు నాని తల్లిదండ్రులను ఘనంగా సత్కరించి నగదు ప్రోత్సాహం అందించారు. టిడిపి నియోజకవర్గం ఇంచార్జి కర్రోతు బంగార్రాజు రూ. 20వేలు, టిడిపి నెల్లిమర్ల మండల అధ్యక్షులు కడగల ఆనంద్‌కుమార్ రూ. 20వేలు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రూ. 10వేలు, గరికిపేట మాజీ సర్పంచ్ చింతపల్లి సత్యనారాయణ రూ. 5వేలు, టిడిపి నాయకులకు చింతపల్లి వెంకటరమణ రూ. 5వేలు, బెల్లాన అచ్చంనాయుడు రూ. 5వేలు చొప్పున ప్రోత్సహకం అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సువ్వాడ రవి శేఖర్, అధికార ప్రతినిధి గేదల రాజారావు, రాష్ట్ర ఎస్‌సి సెల్ అధికార ప్రతినిధి రాజప్పన్న, తాడ్డి సత్యనారాయణ, గురాన చక్రి, అట్టాడ బుజ్జి, బెల్లాన చిన్నప్పుడు, ఈశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

నానిని సత్కరిస్తున్న కిల్లంపల్లి రామారావు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి - గజపతినగరం

ఎక్కడో పుట్టి..ఎక్కడో పెరిగి.. ఇక్కడే కలిసాము..చదువులమ్మ చెట్టు నీడలో..అన్నట్టు ఒకచోట చదువుకొని ఎక్కడెక్కడో స్థిరపడిన వారంతా ఒక చోట కలుసుకున్నారు. తమ చిన్న నాటి మధుర జ్ఞాపకాలను, అల్లరి చేష్టలను గుర్తు చేసుకున్నారు. అందుకు గజపతినగరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికైంది.

ప్రభుత్వ ఉన్నత పాటశాలలో 1989-90లో పదో తరగతి చదువుకున్న విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా జరిగింది. సుమారు 33 ఏళ్ల క్రితం ఈ పాఠశాలలో చదువుకొని ఎక్కడెక్కడో దేశ విదేశాల్లో వివిధ వృత్తుల్లో స్థిరపడిన వారంతా ఈ అపూర్వ కలయికకు హాజరయ్యారు. బడి ప్రాంగణంలో అడుగు పెడుతూనే హోదాలను మరచి ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుంటూ ఒకరి యోగ క్షేమాలు మరొకరు అడిగి తెలుసుకున్నారు. 45ఏళ్ల వయసు దాటినా.. తమ చిన్ననాటి జ్ఞాపకాలను, చిలిపి చేష్టలను అల్లరి పనులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఈ కార్యక్రమానికి ఆహ్వానించి తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనను గుర్తు చేసుకున్నారు. వారితో గ్రూపుగా ఫోటోలు దిగి సందడి చేశారు. ఉపాధ్యాయులకు పాధాభి వందనం చేశారు. అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలోని శ్రీనివాస కళ్యాణ మండపంలో జరిగిన సమావేశంలో తమతో పాటు చదువుకొని మృతి చెందిన విద్యార్థులను స్మరించుకుంటూ నివాళులు అర్పించారు. అనంతరం ఆనాటి ఉపాధ్యాయులు, హెచ్ఎం ఎ.అప్పలస్వామి మాస్టారు, వేణు మాస్టారు, మాధవరావు, మహిళా ఉపాధ్యాయులు భాషా, లలిత, పద్మావతి, వరలక్ష్మి, దైవకృపలను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ తాము విద్య నేర్పిన విద్యార్థులు అనేక ఉన్నత స్థానాల్లో స్థిరపడడం తమకు ఎంతో గర్వకారణంగా ఉందని అన్నారు. ఉన్నత స్థానాల్లో స్థిరపడిన వారంతా సమాజానికి మేలు చేయడం ద్వారా తమ ఉన్నతిని చాటుకోవాలని గుర్తు చేశారు. తోటి వారికి సాయి పడాలని సూచించారు. అనంతరం పూర్వ విద్యార్థుల కమిటీ తరపున ఉపాద్యాయలకు, పూర్వ విద్యార్థుల లకు బహుమతులు అందజేశారు.

ఒకేచోట కలిసిన పూర్వ విద్యార్థులు

రహదారులను బాగు చేయండి మహా ప్రభో..!

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వీలుపర్తి నుంచి వావిలిపాడుకు వెళ్లే రోడ్డు మలుపు వద్ద నుండి గిరిజన గ్రామాలకు వేసిన రోడ్డు పూర్తిగా శిథిలావస్థకు చేరింది. రెండు కిలోమీటర్ల వరకు రోడ్డు క్వారీ లారీలు రాకపోకల వల్ల పూర్తిగా పాడైపోయి ద్విచక్ర వాహనాలు సైకిళ్లు ఆటోలు ప్రయాణం సాగించడానికి ఇబ్బందిగా మారింది. రోడ్డు బాగు చేయించి రాకపోకలకు ఆటంకం లేకుండా చేయాలని దుమ్ము ధూళి ఎగరకుండా నీటితో తడిపించాలని గిరిజనులు కోరినా అధికారులు పట్టించుకోవడం లేదు. డిఆర్ఒ స్పందించి వెంటనే సమస్యను పరిష్కరిస్తామని ప్రజా వేదికలో అందరి సమక్షంలో హామీ ఇచ్చినా ఫలితం లేకుండా పోయింది. మూడు నెలలకు కావస్తున్న ఏ విధమైన చర్యలు చేపట్టకపోవడంతో అత్యవసర సమయాల్లో వేపాడ మండల కేంద్రానికి రావాలంటే నరకం చూస్తున్నామని ప్రయాణికులు చెబుతున్నారు. ఇప్పటికైనా డిఆర్ఒ స్పందించి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

విజయనగరం: గోతులమయమైన రహదారి

వేపాడ: మరమ్మతులకు గురైన రహదారి

గోతులను పూడ్చాలి

విజయనగరం: స్థానిక రింగ్‌రోడ్ ఎంట్రన్స్ బస్‌స్టాప్ నుంచి డెంకాడ వైపు వెళ్లే ఆర్‌అండ్‌బి రహదారి పూర్తిగా పాడైంది. ఎపి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ కార్యాలయం ముందు ఉన్న రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ఫలితంగా వాహన చోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

గ్రంథాలయాలతో ఎంతో మేలు

ప్రజాశక్తి- గంట్యాడ

గ్రంథాలయాలతో ఎంతో మేలు జరుగుతోందని మండల గ్రంథాలయ శాఖాధికారి రాంబద్రరాజు అన్నారు. మండలంలోని కొండ తామరాపల్లిలో విద్యార్థులకు ఆదివారం రూ. 20వేలు విలువ చేసే నోట్ పుస్తకాలను ఆయన పంపిణీ చేశారు. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే స్టడీ మెటీరియల్ ను ఎయిమ్ ఇనిస్టిట్యూట్ నాయుడు గ్రంథాలయానికి అందజేశారు. సర్పంచ్ కోడెల ముత్యాలనాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాంభద్రరాజు మాట్లాడుతూ గ్రంథాలయాలు పట్టుకొమ్మలాంటివని, వాటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ కోడెల ముత్యాల నాయుడు మాట్లాడుతూ విద్యార్థులు విజ్ఞానాన్ని పొందడానికి గ్రంథాలయాలకు తప్పనిసరిగా రావాలన్నారు. అనంతరం రావాడ మంగమ్మ జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు భర్త రావాడ రామచంద్రరావు, కుమారులు రావాడ ముత్యాల నాయుడు, సత్యనారాయణ, అనపర్తి సూర్యనారాయణ సమక్షంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు కాంపిటేటివ్ పుస్తకాలను కొండ తామరపల్లి లైబ్రరీలో వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మార్పు అప్పారావు, గ్రామ పెద్దలు జగన్నాథం, కోడెల శ్రీనివాసరావు, కొమ్మినేని బంగారు నాయుడు, కొయ్యాన రాంబాబు, బీడీసీ నిర్వాహకురాలు ఎర్నమ్మ తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న నిర్వాహకులు

కొనసాగుతున్న విచారణ

లక్కవరపుకోట: మండలంలోని కొట్యాడలో బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన సంగతి పాఠకులకు విధితమే. ఈ విషయంపై ఇప్పటికే వేలిముద్ర నిపుణులు విగ్రహంపై పడిన వేలిముద్రలను సేకరించారు. వాటి ఆధారాలతో పాటు మరికొన్ని కోణాలలో నిందితులను పట్టుకునేందుకు విచారణ కొనసాగిస్తున్నామని స్థానిక ఎఎస్ఐ గోవిందరావు మీడియాకు తెలిపారు. ఇదిలా ఉండగా ధ్వంసం చేసిన అంబేద్కర్ స్థూపం వద్ద దళిత సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఇండియా మిషన్ జిల్లా మీడియా కన్వీనర్ పి రాజేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలనుకుంటే తప్పనిసరిగా ప్రభుత్వ అనుమతులు తీసుకోవాలని తెలిపారు. గ్రామానికి చెందిన అధిక సభ్యుల కోరిక మేరకు సరైన ప్రాంతంలో అంబేద్కర్ విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల దళిత సంఘ నాయకులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వడదెబ్బకు వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - జామి

వడగాల్పులతో ప్రజలు అల్లాడిపోతున్నారు. మండలంలోని చింతాడ గ్రామంలో డెగల సన్యాసి (70) వడగాల్పులు తీవ్రతకు ఆదివారం మృత్యువాత పడ్డాడు. జిల్లాలో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలో వృద్ధులు, పిల్లలు అల్లాడిపోయారు. అందులో భాగంగానే గత కొద్ది రోజులుగా ఇంటికే పరిమితమైన సన్యాసి మృతి చెందాడు. సన్యాసికి కుమారుడు ప్రకాష, కోడలు ఉన్నారు.

పిడుగుపాటుకు ఆవు మృతి

ప్రజాశక్తి- వంగర

మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం పడిన పిడుగుపాటుకు కోరాడ గంగులకు చెందిన ఆవు మృతి చెందినట్లు తహశీల్దార్ డి ఐజాక్ తెలిపారు. పాడి రైతు తన ఆవుకు మేత కోసం గ్రామ సమీపంలో తీసుకొని వెళ్లడంతో ఆ సమయంలో ఒక్కసారిగా భారీ గాలులు వీయడంతో పాటు తేలికపాటి వర్షం కురిసింది. పెద్ద శబ్దంతో పిడుగు పడటంతో సుమారు 30 వేల రూపాయలు విలువచేసే ఆవు మృతి చెందినట్లు వెల్లడించారు.

మృతి చెందిన ఆవు

వంగరలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

మండలంలో ఆదివారం సాయంత్రం భారీ గాలులు వీయడంతో పాటు తేలికపాటి వర్షం కురవడంతో ఎం సీతారాంపురంలో రెండు విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. ఎం సీతారాంపురం, మద్దివలస, కొత్తవలస తదితర గ్రామాలలో విద్యుత్తుకు కొంత సమయం అంతరాయం ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఏఈ వినయ్ కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది పనిచేసి విద్యుత్తును మరల పునరుద్ధరించారు.

బాలల హక్కుల పరిరక్షణకు డిఎస్‌పికి వినతి

ప్రజాశక్తి- బొబ్బిలి

బొబ్బిలి జోన్ పరిధిలో బాల బాలికల హక్కుల రక్షణకై మరింత దృష్టిని కేంద్రీకరించాలని స్థానిక న్యాయవాది, బొబ్బిలి జోన్ చైల్డ్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరమ్ అధ్యక్షుడు తుమరాడ గంగాధర్, నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి ముగడ వెంకటరమణలు ఆదివారం డిఎస్పి శ్రీధర్‌ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. బాల్యవివాహల నివారణకై విస్తృత ప్రచారం చేయాలన్నారు. 2023వ అకాడమిక్ సంవత్సరం ప్రారంభం అవుతున్న తరుణంలో ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేసే దానిపై ముందస్తు చర్యలు, పాఠశాలలు, హాస్టల్స్‌లో తగిన పరిశుభ్రత, భద్రత చర్యలు, 14 సంవత్సరాలలోపు పిల్లలతో వెట్టి చాకిరీ, ప్రమాదకర పనులు చేపిస్తున్న యజమానులుపైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రైవేటు విద్యా సంస్థలు అధిక ర్యాంక్ ల కోసం విద్యార్థులపై పెట్టె ఒత్తిడిని తట్టుకోలేక విద్యార్థుల ఆత్మ హత్యల నివారణ కొరకై చర్యలు తీసుకోవాల న్నారు. ఈ కార్యక్రమంలో సామజిక కార్యకర్త సర్వసిద్ధి త్రినాథ పాల్గొన్నారు.

డిఎస్‌పికి వినతి పత్రమిస్తున్న నాయకులు